అతను అంతా విన్నాడు.

ఆ మర్నాడే రాజేశ్వర్రావు ఉత్తరం రాశేడు. తిట్లు తీసేస్తే భ్రమరాంబ చెప్పినవే అతనూ రాశేడు. కాకపోతే కొంచెం సున్నితంగా రాశేడు భ్రమరాంబలాగే అతనూ సలహా యిచ్చేడు. వాళ్ళకి మాత్రం యివ్వవద్దు అని.

ఈసారి జగన్నాధానికి కోపం పిచ్చి స్థాయిలో వచ్చేసింది.

ఛీ! ఛీ! వెధవ మనుషులు. వెధవ బుద్ధులు. పశువు మనిషిలా ప్రవర్తిస్తే "భేష్" అంటాం.

అదే మనిషి పశువులా ప్రవర్తిస్తే ఛీ అంటాం.

వీళ్ళు ఆ రెండో జాతి. ఆ ఇల్లు అలా పాడు పెట్టేస్తాను. కాని వీళ్ళకి యివ్వను అని శపథం చేసేడు. అయితే అతని ప్రమేయం లేకుండా అర్నెల్లకి దానంతటా ఆదే పాడుబడిపోయింది. కిటికీలు, తలుపులు వగైరా కొన్ని పీక్కుపోయేరు.

"పోనీ అమ్మేస్తే?"

ఐడియా బాగానే ఉంది.

అచరణే బావులేదు.

"దెయ్యాలకొంప" అన్న బిరుదే అమ్మకానికీ అడ్డొచ్చింది.

ఆ మధ్య భ్రమరాంబే మరో వార్త మోసుకొచ్చింది.

"ప్రకాశరావే కొనుక్కుంటాట్ట పదివేలకైతే" అని.

ఏమిటీ? లక్షరూపాయల ఇల్లు పదివేలకా!

అంతకంటే ఊరికే యిచ్చేస్తే సరిపోదూ! కనీసం దానం చేసిన పుణ్యమైనా దక్కుతుంది.

స్థలం ఖరీదైనా యివ్వరా?

ఆ ఇల్లు బాగు చేయించకముందు తన పరిస్థితికీ ఇప్పటికీ తేడా ఏమిటీ?

"ఏం లేదు"

కాదు, ఉంది.

బాగు చేయించడానికి చేసిన అప్పు ఎక్స్ట్రా!

ఔను.

ఈ కథ ఎక్కడ ప్రారంభమైందో మళ్ళీ అక్కడే ముగుస్తోంది.

"భూమి గుండ్రంగానే ఉంది మరి!"

**(జ్యోతి, 1.1.1979)**

# ఆడదాని కథ

**"అ**మ్మోయ్! నీకు ఆకాశవాణి నుంచి పిలుపొచ్చింది" అంటూ ఓ కవరు విసిరింది మా అమ్మాయి.

నా గుండె గుభేల్మంది.

బహుశా "నిన్ను చంపబోయేవాడు మీ చెల్లి కడుపున పుడతాడు" అన్న అకాశవాణిక్కూడా కంసుడు అంత భయపడి ఉండడు.

పిల్ల పుట్టాలంటే తొమ్మిది నెలలు చాలు. కాని నా కథలు మాత్రం బుర్రలో అలా కొన్ని సంవత్సరాలుంటాయి. ఈ మధ్యలో బుర్రకి సిజేరియన్ చేసినా, బుర్ర పగుల్తుందే తప్ప కథ బయటకి రాదు. కొన్నాళ్ళపాటు నా కథలు కేవలం ప్రత్యేక సంచికల్లోనే వచ్చేవి. కారణం ఏమిటంటే ఈ ఏడాది ప్రత్యేక సంచికకి కథ రాయడం మొదలు పెడితే, అది వచ్చే ఏటికి పూర్తి అయ్యేది. మళ్ళీ ఆ వచ్చే ఏటి కథ మొదలు పెడితే అది ఆపై ఏటికి అందేది, ఈ వేళ టైముకి వచ్చిన రైలు నిన్నటిది అన్న జోక్ లాగ.

రావలసిన టైముకి రాకుండా హార్ట్ ఎటాక్నైనా ఆపుకోవచ్చునేమో గాని, రేడియో వాళ్ళకి మాత్రం టైముకి కథ రాయడం తప్పించుకోలేం. ఆలోచించిన కొద్దీ బి.పి. పెరిగిందే తప్ప ప్లాటు తట్టలేదు. కథకి ప్లాట్ సంపాదిం చడం కంటే, హైదరాబాద్లో ప్లాట్ సంపాదించడం సులువనిపించింది. ఏం చెయ్యాలో తోచక "కథలు రాయడం ఎలా?" అన్న పుస్తకం లైబ్రరీ నుంచి తెప్పించి చదివేను. అందులో వ్యాసాలన్నీ ప్రఖ్యాత రచయితలు రాసినవే. అవన్నీ చదివేక కథకి ప్లాట్ మాటెలా ఉన్నా, భయం పట్టుకుంది, ఇంతవరకు నేను రాసినవన్నీ కథలేనా అని.

ఏ యిద్దురు రచయితలూ ఏకీభవించరన్నది కేవలం సామెతే! కారణం ఏవంటే ఈ ప్రఖ్యాత రచయితలందరూ కూడబలుక్కున్నట్టు కథకి శిల్పం ఉండాలి అని నిశ్చయించే శారు. అయితే ఆ శిల్పం ముక్కెంత పొడవుండాలో, మూతి ఎంత వెడల్పుండాలో మాత్రం ఎవరూ చెప్పలదు.

ఇంతకీ విత్ ఆర్ వితౌట్ శిల్పం ఇప్పుడు కథ రాయక తప్పదు. మన దగ్గరలేనప్పుడు పక్కవాడిని అప్పో,అరువో అడగొచ్చు. ఒక్క పెళ్ళాం మినహా. మరంచేత అవమానం అనుకోకుండా నేను మా పిల్లలందర్నీ అడిగేసేను – "ఏదైనా ప్లాట్ చెప్పండ్రా" అని.

"చక్కటి ఇంగ్లీషు డిటెక్టివ్‌కథ ఒకటి తెనిగించు" అన్నారు నా కూతుళ్ళు. "ఎలిస్టర్ మేక్లీన్" లోంచి ఒకరు, "ఛేజ్" లోంచి ఒకరు బుర్ర పైకిపెట్టి.

"బ్రహ్మాండమైన క్రికెట్ కథ రాయి" అన్నారు నా సుపుత్రులు బేట్‌లు ఊపుకుంటూ.

మొదటిది నాకిష్టం లేదు. రెండోది నాకు తెలీదు. మరం చేత అన్యథా శరణం నాస్తి అని మావార్ని పట్టుకున్నాను. మార్కం డేయుడు శివుడ్ని పట్టుకున్నట్టు.

ఐతే మార్కండేయుడికీ, నాకూ భక్తి ఒక్కటే తేడా.

"కథా!" అన్నారు మా వారు ఖూనీనా అన్నంత ఆశ్చర్యంగా "అవును-కథే" అన్నాను.

"హు" అన్నారు తనే. నేనేం అనలేదు.

"నేను కథ చెప్తే నువ్వు క్రెడిట్ కొట్టేస్తావా?" అన్నారు తన ఆస్థి నేనేదో అన్యాయంగా అనుభవించేస్తున్నట్టు.

సరిగ్గా ఆ మాటే అంటున్నారు అందరూ. వచ్చిన నింద ఎలాగా వచ్చింది. మరింక అనవసరంగా నేనెందుకు కష్ట పడాలీ? అన్నాను.

"నువ్వు అసలు స్త్రీ జాతికే అవమానం" అన్నారు.

అయితే అయ్యేను కాని కథ చెప్పమన్నారు.

"ప్రస్తుతం దేశంలో సారస్వత లోకాన్ని ఎవరేలుతున్నారు?" స్త్రీలు.

"సినీమా ప్రపంచాన్ని ఎవరుద్ధరిస్తున్నారు?" స్త్రీలే.

ఎవార్డు లెవరివి? ఇంకెవరివి? ఆడవాళ్ళవే.

వారపత్రికల మహారాజులెవరు? వనితలే

మాసపత్రికల రాజపోషకులెవరు? మగువలు.

అలాంటి స్త్రీ జాతిలో పుట్టి "ఆఫ్టరాల్ ఒక కథ రాయలేక పోతున్నావంటే...."

"కథ చెప్పండి" అన్నాను కన్నంపడ్డ రికార్డులాగా

"దసరా మామూలు వాళ్లలా, ఎల్.ఐ.సి. ఏజెంటులా పట్టుకుంటే వదలవు. ఖర్మ సరే రాసుకో... ఓ ఖరీదైన కుర్రాడుం టాడు. వాడోనాడు ఏదో పుస్తకం పల్లెటూళ్ళే భారతదేశపు వెన్నె ముకలని చదివినవాడై, ఆ ఏముకలెలా ఉంటాయో చూడాలన్న కోరికతో, తన ఖరీదైన కార్లో పక్కనే వున్న పల్లెటూళ్ళే వెళ్తాడు"

"ఏం పాపం ఆ కుర్రాడికి చదువు, ఉద్యోగం వగైరా లేం లేవా?" డౌటు వచ్చింది నాకు.

"ఛీ, ఛీ కాళిదాసు క్కూడా మూడ్ పాడు చేసేస్తావు. కథకి అడ్డు రాకుండా చెప్పింది విను. వెళ్ళి ఆ తరువాత ఏం చెయ్యాలో తోచక కాలక్షేపానికి క్లోజప్పులో ఒక పల్లెపడుచుని ప్రేమించి, లాంగ్‌షాట్‌లో వెళ్ళిపోతాడు. ఆ అమ్మాయి నెల తిరక్కుండానే నెలతప్పి, ఆ మాజీ ప్రియుడ్ని వెతుక్కుంటూ పట్నం వెళ్తుంది. వాడెక్కడా దొరకడు. ఆ అమ్మాయి ఛీ – ముష్టి మొగాళ్ళు అని తిడుతుంది. మరింక ఏం తిట్టాలో తోచక, కసి కొద్దీ కాల్‌గర్ల్ అయిపోతుంది...."

ఒళ్లు మండిపోయింది నాకు. ఇది కథా? సినీమానా?

"సర్వ కథలూ సినిమా గచ్ఛంతి" అన్నారు ఆయనే. ఆయన చిన్నప్పుడు హైస్కూల్లో సంస్కృతం చదివేడు, పెద్ద అయ్యాక వేదాలన్నీ వెనుకనించి నవిలేద్దావని ఫలితంగా ఇటు సంస్కృ తమూ రాలేదు, అటు తెలుగూ అబ్బలేదు.

"అంచేత పెన్నుని ఎప్పుడూ సినిమాకే గురిపెట్టు. ఏ తల మాసినవాడో తియ్యకా పోడు. ఆనక వాడికి గుండు అయిపోకా తప్పదు. ఆఫ్‌కోర్సు ఎవరి తలరాత ఎవరు రాస్తారో చెప్పలేం అనుకో .... అన్నట్టు ఈలోగా ఆ హీరోయిన్‌కి ఓ కూతురు పుడుతుంది. నాకు కోర్టుకి టైమైపోయింది. మరంచేత యింత వరకు మసాలా కలిపి రాయి. ఆ కూతురు గుంటనేం చెయ్యాలో సాయంకాలం ఆలోచిద్దాం" అంటూ లేచి వెళ్ళిపోయేరు.

"నా పెన్నేదర్రా?" మా వారిమీద కోపం ఆ కేకే చెబు తుంది. "చిన్ని" పట్టుకెళ్ళాడు అంది చిన్నది.

"మరి వాడిదేమైంది" పార్వతి దగ్గరుంది.

"దాన్ది?" "నేను వాడుతున్నాను"

"మరి నీది?" "పోయింది"

ఈ పేదరాశి పెద్దమ్మ కథకి పిచ్చెక్కిపోయింది.

"ఏదో ఒకటి యిలా తగలెయ్యి!" అరిచేను.

తగలేసింది.

ఈ పూటెలాగైనా సరే కథ రాస్తే కాని కదలదల్చుకో లేదు. మంచంమీద మఠం వేసుక్కూర్చున్నాను. పెన్ను మూత తియ్యడం నా చీర, తెల్ల కాయితాలు సిరాతో స్నానం చెయ్యడం, నేను పెన్ను విసరడం – అన్నీ అర క్షణంలో జరిగేయి.

“ఛత్తెరి ! వెధవ దరిద్రం ఎన్ని పెన్నులు కొన్నా సంతకం పెడదామంటే పెన్నుండదు. మళ్ళీ యింట్లో అందరూ స్టూడెంట్లే. ఇంకీ ఇల్లు బాగుపడదు. పెన్నుని కూడా పెట్లో పెట్టి ఎంతకని దాచుకుంటా?” నా సణుగుడు పూర్తి కాకుండానే అంట్లెయ్యండి, పొద్దెక్కి పోనాది అంటూ అమ్మ వారిలా ఎదురుగా నిలుచుంది పనిమనిషి.

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ అయినా బతిమాలితే కాస్సేపు ఆగు తుందేమో కాని, మా పనిమనిషి మాత్రం అరనిమిషం కూడా ఆగదు. అంట్లు దానికి, పెన్ను మా చిన్న దానికి పడేసి మళ్ళీ మంచం ఎక్కాను – ఇల్లంతా వెతగ్గా వెతగ్గా దొరికిన ఓ పెన్సిలు ముక్క పట్టుకొని అసలా అరంగుళం పెన్సిలు దొరక్కపోతే ఈ వేళ మసిబొగ్గుతోనైనా సరే రాసెయ్యాలన్నంత ఉక్రోషంగా ఉంది. రాసేద్దును కూడా.

ఇంతలో “పాలకు డబ్బులు...” ఎదురుగా జెండా కర్రలా నిల్చున్నాడు జవాను.

ప్రపంచం తిరగబడిపోయినా సరే, ఒక అర గంటవరకూ ఆగమన్నాను. ప్రపంచం సంగతి తనకి తెలీదట. కాని పాల నెల మాత్రం వచ్చేసిందట. ఆగడానికి తనకేం అభ్యంతరం లేదట, పాలవేను వెళ్ళిపోకుండా వుంటే.

అమ్మబాబోయ్ ! పాలుగాని దొరక్కపోతే సాయంత్రం కాఫీ లుండవు. రేపు మజ్జిక వుండదు. పోనీ హోటలు నుంచి మజ్జిగ తెచ్చుకుందామంటే ఆ హోటలువాడు గ్లాసెడు తెల్ల నీళ్ళు రూపా యికి అమ్ముతాడు. ఇంతకీ రేపటి వరకు బతికిబావుంటే మజ్జిగ సంగతి, అసలీ పూట కాఫీ లేకపోతే యింట్లో అందరూ వెర్రి కుక్కల్లా కరిచేస్తారు.

“పద” అని లేచి మొల తడువుకున్నాను. తాళాలేవీ.

పరుపుల కింద, తలగడ కింద పిల్ల జేబులు, మూలల్లూ ఆట సామాన్లు అన్నీ వెతికేను. అందరి ఇళ్ళ సంగతి నాకు తెలీదు కాని, మా యింట్లో మాత్రం తాళాల వేటకి సగం జీవితం అయి పోతుంది. ఒక తాళాలే కాదు–ఏ వస్తువూ పెట్టిన చోట ఉండదు, ఏదీ అవసరానికి కనిపించదు. మనుషుల్తో సహా. తాళాల కోసం వెదికితే తువ్వాలు దొరుకుతుంది. తువ్వాలు కోసం వెతికితే జాకెట్ దొరుకుతుంది.

“ఇది ఇల్లా! మాయల మరాఠీ సంసారవాఁ! అని మా వారు అస్తమానం సణుగుతూనే ఉంటారు. అయినా మా ఇంట్లో ఏదో ఒక దాని కోసం నిర్విరామ వేట సాగుతూనే ఉంటుంది. ఇంతకీ ఇప్పుడీ తాళాలు దొరుకుతే తప్ప నా కథ నడవదు.

“ఒరే అరుణా! నా తాళాలు కనిపించేయిరా?” అడిగేను.

వాడు వాళ్ళ నాన్నకి అక్షరాలా కొడుకు. అంచేత అడిగిన దానికి సమాధానం చెప్పలేదు సరికదా. “అంటే నీ కోపం కాని అమ్మ, నీ తాళాల కొక ప్లేస్ లేదు. ఎక్కడ చూసిన అవే. మేకునో, మొలనో పెట్టుకోకూడదూ ఇలా అస్తమానం మమ్మల్ని చంపకపోతే” అని నా అశ్రద్ధ గురించి అరగంట లెక్చరిచ్చేడు.

ఈ లోగా ఏఁవిఁటా కేకలు? భూకంపం వస్తోందా?

ప్రళయం వస్తోందా? అదేం కాదట.

నా కూతుళ్ళిద్దరూ బాత్రూమ్‌లోంచి ఒకరు, బైటనుంచి ఒకరు ఖూనీలైపోతున్నారు. తువాలు మర్చిపోయేను యిమ్మం టుంది లోపలున్న చిన్నది.

“అసలింతసేపు బాత్రూమ్‌లో కాపురం చేసే మిగిలిన వాళ్ళే వైఁపోవాలి? నాన్నని నీ ఒక్కర్తెకు స్పెషల్ బాత్రూమ్ కట్టించ మను” అంటుంది పైనున్న పెద్దది–తువ్వాలు యిస్తాను, యివ్వను అనకుండా. నిజం ఏవిఁటంటే దానికి తువ్వాలు వెదకడం బద్ధకం. చిన్నప్పుడు చెయ్యి కడుక్కోవటం బద్ధకం వేసి అన్నం తినడం మానేసేది అది.

వెధవ గోల. ఇది ఇల్లా? జిన్నాటవరు సెంటరా? ఏఁవిఁ టా కేకలు? ఆడపిల్లలు కారూ? తాళాలు దొరక్క నేను చస్తూ వుంటే ఈ కుక్క జెట్టీలేవిటి? అని యిద్దర్నీ జెమిలిగా నాలుగు తిట్టి తువాలు దానికి, మరో నాలుగు చీవాట్లు దీనికీ యిచ్చి, మళ్ళీ తాళాల వేట కంటిన్యూ చేశాను.

ఈ లోగా ఏవిఁటమ్మా వెతుకుతున్నావు? అన్నాడు అక్కడు ఉన్న లల్లూ.

బల్లితోక అయినా కాస్సేపు వదుల్తుందేమో కాని వాడు మాత్రం నన్ను వదలడు.

తాళాల్రా నాన్నా! అన్నాను.

“ఇలా.... ఇలా... గుండ్రంగా ఉంటాయే... నువ్వు బీరువా తీస్తేవే... అవా?” అన్నాడు వాడు చేతుల్తో అభినయిస్తూ.

“అవే. నీకు కనిపించాయిరా తల్లీ?” అడిగేదు చిన్ని.

తల గుండ్రంగా తిప్పేడు. “ఎక్కడ?”

"అవీ... అవీ... నేను.... నేను... మేడమీంచి కింద విసిరేను కదా?" చంటి వెధవ కాబట్టి ఊరుకున్నాను కాని, చాచి లెంప కాయ కొట్టాలనిపించింది.

పాలసీను అయిపోయేక మళ్ళీ మంచం ఎక్కాను. ఈ సారి దేవుడొచ్చినా దిగదల్చుకోలేదు.

దేవుడు రాలేదు కాని కోర్టు నుంచి జవాను వచ్చాడు. యమ దూతలా యమదూతకి చేతిలో పాశం ఉంటుంది. వీడి చేతిలో ఫ్లాస్కుంది. "అయ్యగారు అర్జంటుగా నాలుగు కాఫీ పంప మన్నార"ట.

పంపమంటారు. ఎందుకు పంపమనరూ? పంపించే వాళ్లుంటే ఫ్లాస్కుతో కాఫీ ఏం కర్మ? బిందెల్తో బీరు పంపమంటారు. ఆ మనిషి అంతే.

"ఛీ-ఛీ! అలాంటి మొగుడు, ఇలాంటి పిల్లలు ఉన్న నాలాంటి వాళ్లు కథ రాయాలనుకోవడం మహా పాపం అనుకొని గట్టిగా లెంపలేసుకొని మంచం దిగేసేను".

**(విజయ, 1.5.1979)**

# సిగరెట్లు మానేద్దాం

ఆకాశంలో చుక్కల్లేవు.

భూమ్మీద లైట్లూ లేవు.

పైనా, కిందా యెటు చూసినా ఆడదాని బతుకులా అతి భయంకరమైన చీకటి.

ఆ చీకట్లో ... మా డాబా మీద...

నాలుగే నాలుగు నక్షత్రాలు మినుగురు పురుగుల్లా సిగరెట్లు యాష్ట్రేలో పడేస్తూ.

నాలుగింట్లో ఒక నక్షత్రం రాలిపోయింది.

"సారీసర్. నేను సిగరెట్లు మానేశాను" అన్నాడతను తన దగ్గర అగ్గిపెట్టె లేనందుకు ఎపోలజెట్టిగ్గానూ, సిగరెట్లు మానేసి నందుకు కొంచెం గర్వంగానూ. అతను పాపం మనిషి మంచి వాడే కాని అతన్ని గాంధీగారు ఆవహిస్తూ వుంటారు.

"నేను నమ్మను" అన్నాడు నారాయణరావు మా వారికి అగ్గిపెట్టే అందిస్తూ.

"నేను నమ్ముతాను" అన్నారు మా వారు అగ్గిపుల్ల అంటిస్తూ. "సిగరెట్లు మానెయ్యడం చాలా తేలిక. నేను లక్ష సార్లు మానే శాను" అన్నారు ఆయన మళ్ళీ.

"ఈ కొటేషను మీది కాదు.మార్క్‌ట్వైన్‌ది" అన్నాన్నేను ఉక్రోషంగా. "నిన్ను చంపేస్తాను అని ఎవరయినా అంటే పోన్లే పాపం అని క్షమించగలను" కాని "నేను సిగరెట్లు మానేశేను" అన్నవాడికి మాత్రం ఛస్తే క్షమించలేదును.

భళ్ళున నవ్వేరు మా వారు.

ఆ నవ్వుకి.... నారాయణరావు కాలుస్తున్న సిగరెట్టు పొగ గబుక్కున మింగేసి ఉక్కిరి బిక్కిరైపోయేడు.

పిట్ట గోడమీద పడుకున్న పిల్లి పిల్ల దబ్బున కిందపడి పరిగెత్తి పారిపోయింది.

అంతవరకు చీకటిగా వున్న ఆకాశంలో గబుక్కున నక్షత్రాలన్నీ ఒక్కసారి వెలిగేయి.

నవ్వడం అయిపోయేక "క్రితం జన్మలో నా పేరు అదేలే యింతకీ సిగరెట్లు మానెయ్యవచ్చు హార్ట్ ఎటాక్ వస్తే" అన్నారు మళ్ళీ.

"యిది ఈ జన్మ కొటేషన్ కాబోలు. హతోస్మి"

"గురువుగారూ. ఈ మధ్య మీకేదో చిన్న హార్ట్ ఎటాక్ లాంటిది..." ఆగిపోయేరు రామ్మూర్తి.

ఈసారి వేదాంతిలా చిన్న చిరునవ్వు మాత్రమే నవ్వేరు మా వారు. నవ్వుని అలాగే ఉంచి "లాంటివి కాదు హార్ట్ ఎటాకే వచ్చింది. నా డాక్టరు యెంతున్నాడనుకున్నావు? బొడ్డూడలేదు గుంటడికి "ఎప్పటి నుంచి సిగరెట్టు కాలుస్తు న్నారు" అన్నాడు. "నువ్వు పుట్టకముందునుంచి" అన్నాను. "రోజుకి ఎన్ని కాలుస్తా" రన్నాడు. చెప్పేను. అంతే మరి నోటంట మాటరాలేదు మాన వుడికి. ఆ షాక్‌కి కొంపతీసి హార్ట్ ఎటాక్ రాలేదు కదా అని భయం వేసింది నాకు. అతని బాధ చూడలేక ఆరువారాలు సిగరెట్లు మానేశాను. యింతకీ "ఈ సిగరెట్లు యీ హార్ట్ ఎటాక్‌లు నన్నేం చెయ్యవు నేను మహర్షిని" అన్నారు కళ్ళు మూసుకొని, మఠం వేసుకొని సిగరెట్టు కాలుస్తున్న మహర్షిలా.

ఆయన మహర్షి అవునో కాదో నాకు తెలీదు కాని, ఈ సిగరెట్లు లెక్చర్లు విని నా బుర్ర పిచ్చెక్కిపోతోంది. ప్రతి గొంగళి పురుగు సీతాకోక చిలుక అవుతుంది(ట).